హుజూరాబాద్ దవాఖానలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

ప్రభుత్వ దవాఖానల్లో నాణ్యమైన వైద్యం

- డీసీహెచ్ఎస్ కృష్ణ ప్రసాద్

హుజూరాబాద్ రూరల్, మే 22: ప్రభుత్వ దవాఖానల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని, గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్ సూచించారు. బుధవారం హుజూరాబాద్ ఏరియా దవాఖానను తనిఖీ చేశారు. దవాఖానలోని డయాలసిస్, ల్యాబ్, ఫార్మసీ, లేబర్, క్యాజువలిటీ, పలు విభాగాలు, వార్డులను పరిశీలించారు. దవాఖాన ఏవో డాక్టర్ నారాయణ్ రెడ్డి, డాక్టర్ సోమశేఖర్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, రోగుల పరిస్థితిని బట్టి సాధ్యమైనంత వరకు ఇక్కడే చికిత్స అందిస్తున్నారని, తప్పని పరిస్థితిలోనే నిబంధనల ప్రకారం వరంగల్ ఎంజీఎం దవాఖాన, కరీంనగర్ సివిల్ హాస్పిటల్‌కు రెఫర్ చేస్తున్నారని తెలిపారు. వైద్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని సూచించారు. విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కోరారు. డీఏవో ముజామిల్ ఖాన్, వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలి
- విద్య, ఆర్అండ్‌బీ శాఖల అధికారులతో సమీక్షలో కలెక్టర్

కమాన్‌చౌరస్తా, మే 22 : జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలతో కూడిన విద్య అందించే దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖ, ఆర్అండ్‌బీ ప్రత్యేకాధికారులతో పాఠశాలల అభివృద్ధి పనుల ప్రగతి, మంచినీటి సరఫరా, విద్యార్థుల యూనిఫాం తయారీ తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యాశాఖ అధికారులు బడిబాట కార్యక్రమం కోసం ముందుగానే సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో 345 పాఠశాలల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టగా, కొన్ని చోట్ల నిర్వహించే పనుల్లో విద్యాశాఖ అధికారుల ప్రమేయం ఉండడం లేదన్నారు. పనులను పూర్తి చేయించడంలో అధికారులు పూర్తి నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. మొదటి ప్రాధాన్యతగా మౌలిక సౌకర్యాలైన మంచినీరు, టాయిలెట్స్ మరమ్మతులు, విద్యుత్తు పనులను చేపట్టి సత్వరం పూర్తయ్యేలా మండల ప్రత్యేక అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. జూన్ 10లోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, పాఠశాలలకు సంబంధించిన ప్రతి పనిని రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వేసవి సెలవులు పూర్తిచేసుకొని తిరిగి పునఃప్రారంభం అయ్యే నాటికి ఏ పని పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రావు, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్, ప్రత్యేకాధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

అణగారిన వర్గాల వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ

కలెక్టరేట్/తెలంగాణచౌక్, మే 22 : అట్టడుగు వర్గాలకు మెరుగైన విద్యనందించి, వారిలో విద్యా విప్లవం సృష్టించిన భాగ్యరెడ్డి వర్మ అణగారిన వర్గాల వైతాళికుడిగా మారారని కలెక్టర్ పమేలా సత్పతి కొనియాడారు. డా.భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని మాతాశిశు కేంద్రం సమీపంలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దళిత బాలికల కోసం పాఠశాలలు స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేసి మహాత్మా, జ్యోతిబాపూలే వారసత్వాన్ని కొనసాగించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని గుర్తు చేశారు. సమసమాజ నిర్మాణానికి అవిరాళ కృషి చేసి, భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేశారని పేర్కొన్నారు. మహనీయుల జీవిత చరిత్ర నేటితరం బాలలకు తెలియజేయాల్సిన అవసరముందన్నారు. వారి ఆశయాలు, లక్ష్యాలకనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ అభివృద్ధి అధికారి పీ నతానియేల్, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సామాజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీరన్న జాతరకు హాజరైన ఎమ్మెల్యే

సిర్సపల్లిలో బీరన్న జాతరకు హాజరైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, మే 22: హుజూరాబాద్ మండలం సిర్సపల్లిలో బుధవారం బీరన్న జాతరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పండించే రైతులకే బోనస్ ఇస్తామనడం సరికాదని, ఏ రకమైన వడ్లను పండించినా బోనస్ ఇవ్వాలన్నారు. రైతులకు వెంటనే రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నల్లగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

తిమ్మాపూర్ రూరల్, మే 22: మండలంలోని నల్లగొండ లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్, కమిటీ సభ్యుడు కందుకూరి లక్ష్మీరాజం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌యూకు పూర్తి స్థాయి వీసీ నియమించాలి

తెలంగాణచౌక్, మే 22: శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ ఒక ప్రకటనలో కోరారు. యూనివర్సిటీలు అభివృద్ధి పథంలో నడవాలంటే రెగ్యులర్ వీసీని నియమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం రాజకీయ జోక్యం లేకుండా విద్యావంతులైన వ్యక్తిని పూర్తిస్థాయి వీసీగా నియమించాలని కోరారు. ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వీణవంక, మే 22: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. మండలంలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఆయా శాఖల అధికారులు వెల్లడిస్తారని, అలాగే చేయాల్సిన పనుల గురించి సమావేశంలో చర్చ ఉంటుందని పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని, మండల ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

పేద మహిళలకు చీరల వితరణ

చొప్పదండి, మే 22: రాగంపేట హనుమాన్ ఆలయంలో చైర్మన్ నలుమాచు మనోహర్–రాధ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పేద మహిళలకు 101 చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న నలుమాచు రాధ – మనోహర్ దంపతులను గ్రామస్తులు, ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, బొల్లం సరోజన, బైరి వెంకటసాయి, ఎలిగేటి మల్లేశం, దండే వెంకటేశ్, నజ్మా, లక్ష్మి, లక్ష్మమ్మ, రాజమ్మ, లింగమ్మ, రాజేశ్వరి, వినోద, కృష్ణమ్మ, పుష్ప, రాజేశ్వరి పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కలెక్టరేట్, మే 22: అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కో కన్వీనర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేదిక జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం నగరంలోని లక్ష్మీనగర్‌లో గల సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఓ వైపు రైతుల సమస్యలపై ఏమాత్రం పట్టింపులేని విధంగా వ్యవహరిస్తూ, మరోవైపు రైతాంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదంటూ ఆ పార్టీ నేతలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ పథకం ప్రారంభాన్ని సాగదీస్తుండగా, సన్న వడ్లకే బోనస్ ఇస్తామంటూ ప్రకటనలు చేయడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంలో కూడా తాత్సారం చేస్తుండడంతో కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రావడం కోసం అడ్డగోలు హామీలిచ్చి, గెలిచిన అనంతరం వాటిని తుంగలో తొక్కేందుకు యత్నించడం కాంగ్రెస్ దగాకోరు తనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే సమీప భవిష్యత్తులో తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎడమ వెంకటరెడ్డి, కోకన్వీనర్లు మాదాసు రామస్వామి, జంగాలపల్లి రఘుపతి, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింటు న్యాతరి అనూష, W/o. శ్రీనివాస్, R/o.ఐత్రాజుపల్లి, మం॥ సుల్తానాబాద్, జిల్లా పెద్దపల్లి గారు కరీంనగర్ జిల్లా, కొత్తపల్లి ((H) మం॥ రేకుర్తిలో సర్వే నెం. 120 నందు 217.11 చ.గ.ల ప్లాటును మైసాని శంకరయ్య, S/o. రాజయ్య, R/o. గ్రామం॥ ఎలగందుల, మం॥ కొత్తపల్లి (H), జిల్లా॥ కరీంనగర్ గారి నుండి ఖరీదు చేయుటకు విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నారు. లోగడ మైసాని శంకరయ్య గారు ఇట్టి ప్లాటును బండారి మారుతి, S/o. మల్లయ్య, R/o. రేకుర్తి గారి నుండి రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.5352/2015 ద్వారా ఖరీదు చేసినారు. ఇట్టి ప్రాపర్టీకి సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెంబర్లు 2973/2014, 3957/2001, 6162/2013 మరియు రిజిష్టర్డ్ రద్దు దస్తావేజు నెం.10176/2014 గలవి పోయినవని మైసాని శంకరయ్య గారు తెలిపినారు. కావున ఇట్టి దస్తావేజులపై గాని లేదా పై ప్రాపర్టీపై గాని ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల వ్రాతపూర్వక ఆధారాలతో (7) రోజులలో తెలుపగలరు. ఇట్టి దస్తావేజులు దొరికిన వారు నా క్లయింటుకు అందజేయగలరు.

ఇట్లు: **కస్తూరి ప్రకాష్,** అడ్వకేట్
ఇ.నెం. 2-10-1292, జ్యోతినగర్, కరీంనగర్.
సెల్: 99856 38238

WANTED

jobs Apply Now!

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

WANTED

★ ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు గైనిక్, అనుభవం గల నర్సులు (GNM/B.Sc Nursing) కావలెను. స్వయంగా సంప్రదించండి: పుల్లెల హాస్పిటల్, KNR.
NTK-317429

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్లూబెల్స్‌లో చిన్మయ వేసవి బాలల శిబిరం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీతామనోహర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, మే 22 : జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ హైస్కూల్‌లో వాసవీ క్లబ్ వనిత కరీంనగర్ ఆధ్వర్యంలో చిన్మయ మిషన్ నిర్వహణలో వేసవి బాలల శిబిరం ఏర్పాటు చేశారు. పది రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు వివిధ అంశాల్లో పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మచారి అక్షయ చైతన్య గురూజీ పర్యవేక్షణలో గేమ్స్, స్టోరీస్, భగవద్గీత, భజనలు నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ల్యూసిడ హ్యాండ్ రైటింగ్, మ్యాథ్స్ ఫండమెంటల్స్, క్విజ్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీతామనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని కరీంనగర్‌లోని ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు 23వ తేదీ ఉదయంలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జంధ్యం మాధవి, బ్రహ్మచారి అక్షయ చైతన్య, జంధ్యం మధుకర్, చిన్మయ మిషన్ జిల్లా అధ్యక్షుడు జలంధర్, చందా రవీందర్, సుర గీత, పద్మావతి, అనురాధ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ శంకర్ కుటుంబానికి చెక్కును అందిస్తున్న డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్

ఎక్సైజ్ ఉద్యోగుల ఔదార్యం

కార్పొరేషన్, మే 22: హుజూరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో పని చేస్తూ మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎల్ శంకర్ కుటుంబానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ ఉద్యోగులు అండగా నిలిచారు. తమ ఒకరోజు వేతనం రూ.4,91,304 అందించి ఔదార్యాన్ని చాటారు. ఈ మేరకు చెక్కును హెడ్ కానిస్టేబుల్ ఎల్ శంకర్ భార్యకు బుధవారం డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్ కరీంనగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల డీపీవోలు శ్రీనివాస్ రావు, ఏ సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి, పంచాక్షరి, సీఐ, ఎస్ఐల అసోసియేషన్, మినిస్టీరియల్ అసోసియేషన్, హెడ్ కానిస్టేబుల్, ఈసీ అసోసియేషన్ బాధ్యుడు పులి నగేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

సన్న, చిన్నకారు రైతుల అభివృద్ధికే ఎఫ్‌పీవోలు

మాట్లాడుతున్న సుగుణాకర్‌రావు

కొత్తపల్లి, మే 22 : సన్న, చిన్నకారు రైతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం దేశంలో పది వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలు(ఎఫ్‌పీవో) ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు, కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పీ సుగుణాకర్‌రావు తెలిపారు. మండలంలోని చింతకుంట రైతు సంఘ భవనంలో బుధవారం కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల నిర్వాహకులు, ప్రగతిశీల రైతుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో 84శాతం సన్న, చిన్నకారు రైతులేనని, వారిని సంఘటిత పరిచి మార్కెటింగ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తే లాభాలు గడించి ఆర్థికంగా ఎదుగుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్‌పీవోలను విత్తన, ఫుడ్ ప్రాసెసింగ్, ఆహార ఉత్పత్తుల కంపెనీలతో అనుసంధానం పరచాలన్నారు. రాష్ట్రంలో పీఏసీఎస్‌ల మాదిరిగానే ఎఫ్‌పీవోలు కూడా ఎరువుల అమ్మకం, పంటల సేకరణ జరుపుకొనేందుకు అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఫ్‌పీవోల మార్కెటింగ్ నిపుణురాలు డాక్టర్ హేమ, పాలమూరు సీడ్స్ ప్రతినిధి డాక్టర్ అప్పారావు, సిగ్నెట్ సీడ్స్ అధినేత డాక్టర్ సుధేశ్ శర్మ, చింతకుంట ఎఫ్‌పీవో అధ్యక్షుడు శంకరయ్య, నాయకులు నరసింహారెడ్డి, కమలాకర్‌రావు, పురుషోత్తంరావు, పరశురాంగౌడ్, బాపురెడ్డి, వెంకట్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, వేణుగోపాలరావు, రైతు నాయకులు దుర్గం మారుతి, ఇంద్రారెడ్డి, వెంకట్రావు, పరశురాములు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని దాదాపు పది ఎఫ్‌పీవోల ప్రతినిధులు, 200 మందికి పైగా ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి

హుజూరాబాద్, మే 22: హుజూరాబాద్‌లోని అసైన్డ్ భూముల్లో పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతాల్లో గత ప్రభుత్వాల కాలంలో పేద దళితులకు వారి బతుకు దెరువు కోసం ఇచ్చిన అసైన్డ్ భూములను కొందరు రియల్ వ్యాపారులు స్థానిక నాయకులతో కుమ్మక్కై ఎప్పుడో ఇచ్చిన కొన్ని జీవోల ఆధారంగా తక్కువ ధరలకు కొంటు విలువైన ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారని, అయినా స్థానిక అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా అక్రమార్కులపై చర్యలు చేపట్టకపోతే కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట హుజూరాబాద్ భూ బాగోతాలపై ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహిస్తామని సమ్మయ్య హెచ్చరించారు.

పరిహారం చెల్లించాకే రోడ్డు పనులు చేపట్టాలి

ఇరుకుల్ల వద్ద జాతీయ రహదారి రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకొని ఆందోళన చేస్తున్న రైతులు

కరీంనగర్ రూరల్, మే 22: ఇరుకుల్ల గ్రామంలో కొనసాగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను రైతులు బుధవారం అడ్డుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం సేకరించిన తమ భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వరంగల్ జగిత్యాల నేషనల్ హైవే పనులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లో డబ్బులు రైతుల అకౌంట్లలో జమవుతాయని స్థానిక యంత్రాంగం చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, సకాలంలో పరిహారం అందించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని రైతులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు కాశిపాక రమేశ్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, సతీశ్, న్యాలం సంజీవ్, ఎగుర్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి

కథలాపూర్, మే 22: రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఇప్పుడేమో సన్న వడ్లకే ఇస్తామనడం దారుణమన్నారు. ప్రభుత్వ అసమర్థతతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి రెండు నెలలు గడిచినా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు జరుగలేదన్నారు. పలు గ్రామాల రోడ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైతే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఆపేయడం సిగ్గుచేటన్నారు. రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువ మరమ్మతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 10 లక్షలు మంజూరు చేసిందని, ఆ పనులను కాంగ్రెస్ నిలిపివేసిందన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్ఎస్ నాయకులు కల్లెడ శంకర్, గుండారపు గంగాధర్, ఎండీ రఫీ, కొండ ఆంజనేయులు, మిర్యాల వెంకటేశ్వర్‌రావు, చెక్కపెల్లి రాజ్‌కుమార్, జెల్ల వేణుగోపాల్, నాంపెల్లి లింబాద్రి, కల్లూరి రమేశ్, బీ మహిపాల్‌రెడ్డి, ఎంజీ రెడ్డి, సబ్బని గంగు, కొత్తపెల్లి శ్రీనివాస్, ఏజీబీ మహేందర్, ఏనుగు ఆదిరెడ్డి, ముదాం నరేశ్, పుర్కుటపు గంగారెడ్డి, రాచర్ల రవి, పడాల భూమేశ్, జూపక మహేశ్, ఎండీ ఇర్ఫాన్, లక్ష్మీనర్సయ్య, మహేశ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలి

తెలంగాణచౌక్, మే 22 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కోతిరాంపూర్‌లోని ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. అలాగే మహిళలపై వేధింపులు అరికట్టాలని, ఇందు కోసం కఠిన చట్టాలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి మహిళా సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. సమావేశంలో మాదాసు యమున, చేని రోజా, ఎం రమ, కే స్వరూప, అరుణ పాల్గొన్నారు.

ఈతతో ఉపశమనం

శంకరపట్నం, మే 22: ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నారులు మొదలుకొని పెద్దల వరకు మధ్యాహ్నం వేళల్లో బావులు, చెరువుల్లో ఉత్సాహంగా ఈత కొడుతున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో కొందరు చిన్నారులు ప్లాస్టిక్ డబ్బాలు, ట్యూబ్‌లు నడుముకు కట్టుకుని ఈత నేర్చుకుంటున్నారు. శనివారం ఉదయం అర్కండ్ల వాగులో అందరూ ఉల్లాసంగా ఈత కొడుతూ కనిపించారు.

అర్కండ్ల చెరువులో ఈత కొడుతున్న యువకులు

వైభవంగా నరసింహస్వామి జయంతి

వెలిచాలలో నిర్వహించిన నరసింహస్వామి జయంతి కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు– సరోజన

రామడుగు(చొప్పదండి), మే 22: రామడుగు మండలంలోని వెలిచాల శ్రీస్తంభ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నరసింహస్వామి జయంతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్ రావు– సరోజన, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు– కవిత దంపతులు పాల్గొన్నారు.

పొలం ధ్వంసం చేశారని ఫిర్యాదు

హుజూరాబాద్ రూరల్, మే 22: తన పొలంలో అక్రమంగా టిప్పర్లతో మట్టి పోసి ధ్వంసం చేసిన డీబీఎల్ కంపెనీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సింగాపూర్ గ్రామానికి చెందిన రైతు కొరు లింగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సింగాపురం గ్రామ శివారులో కొరు లింగారెడ్డి తన కూతురు భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. ఆ పొలం పక్కనే జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. కాగా, తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తాను నాటు వేసుకున్న భూమిలో అర్ధరాత్రి జాతీయ రహదారి నిర్మాణం కోసం డీబీఎల్ కంపెనీ టిప్పర్లతో మట్టి పోసి పొలాన్ని ధ్వంసం చేశారని లింగారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

పారిశుధ్యాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

గంగాధర, మే 22 : గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీ జనార్దన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని తాడిజెర్రిలో పారిశుధ్య పనులు, తాగునీటి నిర్వహణ పనులను పరిశీలించారు. వీధుల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. గ్రామస్తులు ఇబ్బంది పడకుండా అన్ని వార్డులకు సక్రమంగా తాగునీటిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శునకానికి పెద్దకర్మ

గన్నేరువరం, మే 22: మండలంలోని గుండ్లపల్లిలో శునకానికి పెద్ద కర్మ నిర్వహించి తమ అనుబంధాన్ని చాటారు దాని యజమాని. గ్రామానికి చెందిన చెవుల అజయ్ ల్యాబ్ సింగిల్ బోన్ రకానికి చెందిన శునకాన్ని గతేడాది కొనుగోలు చేశాడు. దానికి టామీ అని పేరు పెట్టి ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. ఈ నెల పదో తేదీన టామీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతి చెందిన నుంచి మూడోరోజు చిన్నకర్మ, బుధవారం పెద్ద కర్మ నిర్వహించారు.

శునకం మృతికి సంతాపంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బెల్ట్ షాపులపై నియంత్రణేది?

చిగురుమామిడి, మే 22: మండలంలో బెల్ట్ షాపులను నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ మిట్టపల్లి మల్లేశం ఒక ప్రకటనలో ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో బెల్ట్ షాపులను తొలగించాలని ఎంపీటీసీలు నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేసినప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నప్పటికీ మండలంలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. బెల్ట్ షాపుల్లో మద్యం ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారని తెలిపారు. అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

రాజన్న గోశాలకు వరిగడ్డి వితరణ

గంగాధర, మే 22 : ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు గంగాధర సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్ ట్రాక్టర్ వరిగడ్డిని వితరణ చేశారు. గోశాలలో కోడెల ఆకలి తీర్చడం కోసం వరిగడ్డిని పంపించిన భాస్కర్‌ను గ్రామస్తులు అభినందించారు. ఇక్కడ నాయకులు వేముల అంజి, పెంచాల చందు, రైతులు ఉన్నారు.